సాక్షి పెద్దపల్లి
సోమవారం। 29। మే। 2023



రాజన్నకు 'సండే' రద్దీ
వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు సమర్పించారు. ఏఈవో శ్రీనివాస్ ఏర్పాట్లు పరిశీలించారు.



గోదావరిలో స్నానాలు
ధర్మపురి: గోదావరి నదిలో ఆదివారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం
వాతావరణం ఉదయం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం మేఘావృతమవుతుంది.

'ముందస్తు'తో మేలు

పంటకాలాన్ని సవరిస్తామన్న ప్రభుత్వం

- జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించని సదస్సులు
- భూసార పరీక్షల శాంపిల్ సేకరణకే దిక్కులేదు

జిల్లాలో పంటలసాగు వివరాలు (ఎకరాల్లో..)

వరి	2,13,819
పత్తి	63,600
మొక్కజొన్న	1,305
ఇతరత్రా	291



ఇటీవల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న రైతులు, అధికారులు (ఫైల్)

సుల్తానాబాద్: అకాలవర్షాలు, వడగళ్ల వానలతో యాసంగిలో సాగు చేస్తున్న పంటలకు మూడేళ్లుగా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో వానాకాలం, యాసంగి పంటకాలాలను నెలరోజుల ముందుకు జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

వ్యవసాయ అధారిత జిల్లా

జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారితమే. అధికభాగం ప్రజలు వ్యవసాయాన్నే నమ్ముకుంటారు. ఇక్కడ ప్రధానపంట వరి. సుమారు 2.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. అయితే వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ప్రతి వానాకాలం.. యాసంగిలో వరి సాగుచేస్తున్న రైతులు అకాలవర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వర్షాలకు పంటలు పూర్తిగా కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నా.. నయాపైసా విడుదల కాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో పంట కాలాన్ని ముందుకు జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సుల్తానాబాద్ మండలం సుద్దాల వంటి గ్రామాల్లో చదువుకున్న యువత వ్యవసాయంలో కొన్నిమార్పులు చేస్తూ.. ముందస్తు పంటలు వేసుకుని లాభపడుతున్నారు. ఇలాంటి పరిస్థితిని జిల్లా వ్యాప్తంగా చేయాల్సిన అవసరం అధికారులపై ఉంది. వానాకాలం సీజన్ జూన్ మాసం నుంచే ప్రారంభం కావాల్సినా.. కొన్ని ప్రాంతాల్లో ఆగస్టు వరకూ కొనసాగుతోంది. దీంతో అకాల వర్షాలకు నష్టం వాటిల్లుతోంది.

యాసంగిలో సాగునీటి సమస్య

జిల్లా ప్రధానంగా కాలువ నీటిపైనే ఆధారపడుతోంది. జిల్లాలోని అధిక విస్తీర్ణానికి ఎస్సారెస్పీ కాలువల ద్వారానే సాగునీరు అందుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టులోకి నీరు చేరడం.. ఆ నీటిని విడుదల చేయడం.. ఆ నీరు పొలాలకు చేరడానికి సమయం పడుతోంది. దీంతో పంటల సాగు కూడా ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి. చెరువులు, కుంటల కింద భూములున్న రైతులు ముందుగానే సాగుకు ఉపక్రమిస్తున్నా.. మంథని పెద్దపల్లి, గోదావరిఖని వంటి ప్రాంతాల్లో ఆలస్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పంటల సాగుకాలాన్ని ముందుకు జరిపేదెలా..? అని వ్యవసాయశాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సాగునీటి వసతు లున్న ప్రాంతాల్లో ముందస్తు సాగుపై అవగాహన కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. పంటల సాగు ప్రణాళికను ఖరారు చేసిన అధికారులు.. ఇప్పటికే ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచారు. సాగునీటి వనరులున్న రైతులు ముందస్తు సాగు చేపడితే వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

కానరాని భూసార పరీక్షలు

వేసవికాలంలో రైతుల భూముల నుంచి మట్టి సేకరించి పరీక్షలు చేయించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో మూడేళ్లుగా భూసార పరీక్షలు చేసిన దాఖలాలు లేవని రైతుల చెబుతున్నారు. భూసార పరీక్షలు చేయడం ద్వారా ఏయే పంటలు ఎలాంటి భూముల్లో వేయాలో తెలుస్తుంది. కానీ అది అధికారులు చేయకపోవడంతో రైతులు తమకు తోచిన పంటలు వేస్తూ నష్టపోతున్నారు.

ప్రారంభించని అవగాహన సమావేశాలు

ప్రతి వానాకాలం.. యాసంగిలో వేయాల్సిన పంటలపై గతంలో అధికారులు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండాపోయింది. వేసవికాలం పంటలు పూర్తయ్యాక గ్రామసభలు నిర్వహించి పంటల విధానం, ఎరువులు, విత్తనాలు ఎక్కడ లభిస్తాయో వివరించేవారు. ఇప్పుడు నామమాత్రంగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

గ్రామ సభల నిర్వహించాలి



వ్యవసాయ అధికారులు గ్రామసభలు నిర్వహించి పంటల సాగు విధానం, విస్తీర్ణం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విత్తనాలు ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు రైతులకు వివరించాలి. అది గ్రామసభల ద్వారా సాధ్యమవుతుంది. రైతులను చైతన్యం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.
– మహిపాల్ రెడ్డి, రైతు, మద్దికుంట

భూసార పరీక్షలు చేయాలి



వ్యవసాయ అధికారులు వేసవిలో భూసార పరీక్షలు చేయించాలి. లేకుంటే రైతులు ఏయే భూముల్లో ఏయే పంటలు వేయాలో తెలియక.. తీరా వేసిన పంటల దిగుబడి రాక నష్టపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.
– తిరుపతి యాదవ్, రైతు, కదంబాపూర్

ఆదేశాలు రాగానే అమలు



సాగును ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సాగు పనులు ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించి ఏవోల ద్వారా ఏఈఓలకు ఆదేశాలు జారీ చేస్తాం. ముందస్తు పంటలు వేస్తే రైతులకు లాభమే. – ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

ఇళ్లలోనే పత్తినిల్వలు

- ధర పెరుగుతుందని రైతుల్లో ఆశ
- మార్కెట్‌లో రోజురోజుకూ పడిపోతున్న ధర
- అమ్ముకుందామంటే దోచుకుంటున్నారని ఆవేదన



'ఈ రైతు పేరు గుర్రం సతీష్. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట. ఈయనకున్న రెండెకరాలకు తోడు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశాడు. సుమారు 50క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర పెరుగుతుందన్న ఆశతో ఇంట్లో నిల్వ చేశాడు.

ఈ పరిస్థితి సతీశ్ ఒక్కడిదే కాదు.. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని రైతుల దుస్థితి. ఏ ఇంటిలో చూసినా పత్తినిల్వలు కనిపిస్తూనే ఉన్నాయి. డబ్బులు అవసరమైనపుడు కొంతమంది కొంత పత్తిని అమ్ముకుని అవసరాలను తీర్చుకుంటుండంగా.. ఇంకొందరు మాత్రం ధర పెరగకపోతుందా..? ఇంత కాలం ఆగాం.. మరికొన్ని రోజులు వేచిచూద్దాం.. అనే ధోరణిలో ఉన్నారు.

పెద్దపల్లిరూరల్: మార్కెట్‌లో పత్తి ధర రోజురోజుకూ పడిపోతోంది. ఈ సీజన్‌లో పత్తి సాగుచేసిన రైతులు వచ్చిన దిగుబడికి ఆరంభంలో మంచి ధరలు రావడంతో ఇంకా పెరుగుతుందనే ఆశతో ఇళ్లలోనే నిల్వ చేశారు. కానీ రోజురోజుకూ పత్తి ధర పతనమవుతుండడంతో ఆవేదనచెందుతున్నారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారారంటూ కొద్దిరోజుల క్రితం మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు బైఠాయించారు.

మార్చి వరకే కొనుగోళ్లు పూర్తికావాలి

ప్రతి సీజన్‌లో పత్తి క్రయ, విక్రయాలు మార్చివరకు పూర్తయ్యేవి. ఈసారి ఆరు నెలలు దాటినా అదే మోస్తరులో పత్తి కొనుగోళ్లు జరుగుతూనే ఉన్నాయి. పెద్దపల్లి మార్కెట్‌లో 2022 అక్టోబర్ 28 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 63,182 ఎకరాల్లో పత్తి సాగు చేసిన రైతులు తమ దిగుబడులను అమ్ముకునేందుకు తేగా ఆరంభమైన రోజు రూ.9వేలు పలికింది. ధర మరింత పెరుగుతుందన్న ఆశతో పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. తర్వాత ధర తగ్గుతూనే వస్తోంది. ఇప్పటికీ పత్తిని అమ్మాలా..? ఉంచాలా..? అనే సందిగ్ధంలోనే రైతులున్నారు.

వ్యాపారులకూ ఇబ్బందే..

మార్కెట్ యార్డుకు పత్తి ప్రతిరోజు 300 నుంచి 400 క్వింటాళ్ల దాకా వస్తే దాన్ని కొనేందుకు పొద్దంతా మార్కెట్‌లోనే ఉంటున్నారు వ్యాపారులు. కొనుగోళ్ల ద్వారా వచ్చే కమీషన్ కన్నా.. గుమస్తాల జీతాలు, ఆఫీసు నిర్వహణ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని పలువురు అడ్తిదారులు వాపోతున్నారు. రైతులు తమ ఇళ్లలో ఉన్న పత్తి నిల్వలు అమ్ముకునేందుకు ఇంక మరో నెల సమయం పట్టొచ్చని అంటున్నారు.



రైతు ఇంటిలో పత్తి నిల్వలు

ధరలు పడిపోయాయి



పత్తి ధరలు గింత అధ్వానంగా ఎన్నడూ లెవ్వు. మొదట్ల ధర పెంచి కొన్నరు. ఇంకింత పెరగకపోద్దా..? అనుకున్నం. గిట్ల రోజుకింత తగ్గతదనుకోలే. ఏం చేయాలో అర్థమైతలేదు. – కాల్వ వెంకటమ్మ, కన్నాల

పరేషాన్ అవుతున్నం



పత్తి రైతులు ఈసారి పరేషాన్ అవుతున్నరు. ధరలు ఎందుకు తగ్గిస్తున్నరో తెల్వలేదు. అమ్ముకునుడా..? దాచుకునుడా? తేల్చుకోలేకపోతన్నం. పైసలు అవసరమయ్యే వరకు ఎంతకైతే గంతకని అమ్ముకునుడైతంది.
– గన్నమనేని సుధాకర్‌రావు

ఈ–నామ్ పద్ధతినే కొనుగోళ్లు



మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ఆన్‌లైన్‌లో ఈనామ్ పద్ధతినే సాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ప్రభావం, పత్తిగింజల ధరల్లో హెచ్చుతగ్గులు కూడా పత్తి ధరపై ప్రభావం చూపుతున్నాయి.
– దేవరాజ్ పృథ్వీరాజ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

న్యూస్‌రీల్

అయ్యప్ప ఆలయంలో ఘనంగా రక్షోఘ్న హోమం



హోమం నిర్వహిస్తున్న సజీవ్ నంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా ఆదివారం సజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5గంటలకు అష్టద్రవ్య గణపతి హోమం, బింబోధారణం, తిల, రక్షోఘ్న హోమం, జలాదివాసం తదతర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి అద్దెంకి సారంగాచారి మాట్లాడుతూ సోమవారం శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం, సహస్ర కలశ పూజ, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, సజీవ్ నంబూద్రి గురుస్వామితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం పర్యవేక్షించింది.

జక్కుల దామోదర్‌రావుకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న దామోదర్ రావు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్‌లో ఈపీ ఫిట్టర్, మెకానిక్ జక్కుల దామోదర్‌రావుకు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ సంస్థ ఆదివారం డాక్టరేట్ పురస్కారం అందించింది. దామోదర్ రావు గని కార్మికుడిగా.. మరోవైపు అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ సంస్థ ప్రతినిధులు తమిళనాడు రాష్ట్రంలోని హుసూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టరేట్‌ను అందించారు. జక్కుల అవార్డు అందుకోవడంపై తోటి ఉద్యోగులు, కాలనీకి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో లావణ్య



సమావేశంలో పాల్గొన్న సోమారపు లావణ్య

గోదావరిఖని: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లాకు చెందిన సోమారపు లావణ్య పాల్గొన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దుగ్యాల ప్రదీప్, చింతల రామచంద్రం పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండలకేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్క మహిళా కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

- హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రగతినగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆదివారం ఆయన శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విజయరమణారావు, బిరుదు రాజమల్లు, ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పురాజు, నాయకులు కోలకిషన్ అక్కపాక తిరుపతి, ఎడెల్లి శంకర్, గాండ్ల మల్లేశం తదితరులు వేడుకలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎన్టీఆర్‌కు తెలుగు ప్రజలంతా వీరాభిమానులేనన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహనీయుడన్నారు. నాయకులు బండారి రామ్మూర్తి, మందల సత్యనారాయణరెడ్డి, సయ్యద్ మస్రత్, మల్లయ్య, సంపత్, శ్రీనివాస్, నూగిల్ల వీరేశం, ఉప్పు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రైస్ ఇండస్ట్రీస్ ఓనర్స్ కార్యవర్గం



అశోక్ కుమార్‌తో పాలకవర్గ సభ్యులు

- అసోసియేషన్ అధ్యక్షుడిగా అశోక్ కుమార్ రెండోసారి..

సుల్తానాబాద్: జిల్లా రైస్‌మిల్ ఇండస్ట్రీస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సుల్తానాబాద్‌కు చెందిన నగునూరి అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా కోలేటి మారుతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాదూరి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొమురవెల్లి రామ్మూర్తి, కట్ల శ్రీనివాస్, ధన్నమనేని తిరుపతిరావు, చకిలం సత్యనారాయణ, ఆకుల రాములు, కార్యదర్శిగా కట్కూరి రాజేశ్, జాయింట్ సెక్రెటరీలుగా కట్ల సత్యం, చకిలం మారుతి, డి.రామారావు, అల్లెంకి కరుణాకర్, నర్సయ్యా సురేశ్, కోశాధికారిగా రమేశ్ ఎన్నికయ్యారు. వీరి పదవికాలం 2026 వరకు ఉంటుంది. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ రైస్‌మిల్ ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే 'దాసరి'కి మళ్లీ టికెట్ ఇవ్వొద్దు

- సహజ వనరులను దోచుకుంటున్నారు
- మున్సిపల్ నిధులనూ వదలడం లేదు
- పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, రైతు సంక్షేమానికి పాటుపడుతుంటే పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఈ ప్రాంత సహజ సంపదను కొల్లగొడుతూ.. అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అలాంటి ఆయనకు వచ్చే ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వొద్దని పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య బీఆర్ఎస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్‌సన్నీతో కలిసి మాట్లాడారు. వరసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మనోహర్‌రెడ్డి ఈ ప్రాంత సహజవనరులను దోచుకుంటున్నారని, సీఎం కేసీఆర్ పాలనకు మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయనకు టికెట్ ఇస్తే ప్రగతిభవన్ ఎదుట ఆమరణ దీక్ష చేపడతానని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న రాజయ్య, సురేందర్‌సన్నీ

మున్సిపాలటీలో ఎమ్మెల్యేదే పెత్తనం..

దాసరి మనోహర్‌రెడ్డి తన కోడలు మమతారెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమించి తన పెత్తనం సాగిస్తున్నారని సురేందర్ సన్నీ ఆరోపించారు. మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేసేందుకు అధికారులపై ఒత్తిడి పెంచారని, సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని వివరాలు సేకరించామని, అధికారులు అనవసరంగా ఇరుక్కోవద్దని సూచించారు. తన భార్య భాగ్యలక్ష్మి కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో ఇతరుల పెత్తనాన్ని ప్రోత్సహిస్తున్నారని, తన వార్డులో చేపట్టిన అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలు జరిగాయని వివరించారు. రోడ్లవెడల్పులో పేదల ఇళ్లను కూలగొట్టించిన ఎమ్మెల్యే.. ప్రగతినగర్‌లోని తన పాఠశాల భవనం ప్రహరీ ఇటుకలు కూలితే కేసులు పెట్టించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన వైఖరి మార్చుకుని పట్టణాన్ని ప్రజల సౌకర్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానసత్రం ప్రారంభానికి రండి

సుల్తానాబాద్: నిత్యాన్నదాన సత్రం భూమిపూజ కార్యక్రమాన్ని తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కోరారు. మండలకేంద్రంలోని ఆయన స్వగృహంలో భూమిపూజకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 31న కొమురవెల్లిలో మున్నూరుకాపు నిత్యాన్నసత్రం భూమిపూజను కాశీపీఠం పీఠాధిపతి శివనాగేంద్ర సరస్వతి మహాస్వామీజీ చేతులమీదుగా చేయించనున్నట్లు వివరించారు. మహోత్సవానికి మున్నూరుకాపు ప్రజాప్రతినిధులు, కులస్తులు పాల్గొనాలని కోరారు. మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు సాదుల సుగుణాకర్, కొమురవెల్లిలో మున్నూరు కాపు కులస్తుల నిత్యాన్నదాన ట్రస్ట్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఆకుల వివేక్‌స్వామిపటేల్, పట్టణ అధ్యక్షుడు బిరుదు కృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు

నేటి నుంచి విశ్వేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



రామగుండం:ఆబాది రామగుండంలో స్వయంభూగా వెలిసిన శ్రీకాశీవిశ్వేశ్వరాలయం ధ్వజస్తంభ స్థిర ప్రతిష్ఠాపన, శిఖర సంప్రోక్షణ వేడుకలను ఈనెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ శిఖర గోపురానికి రంగులు వేస్తున్నారు. ఆలయంలో వేడుకల ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి.

ధాన్యం దించుకోవడం లేదని లారీ డ్రైవర్ల నిరసన

- ఐదు రోజులుగా పడిగాపులు కాస్తున్నామని ఆవేదన

మంథని: రైస్ మిల్లర్లు లారీల్లో తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని డ్రైవర్లు ఆదివారం పెద్దపల్లి–మంథని ప్రధాన రహదారి వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నిరసనకు దిగారు. ధాన్యం లోడ్‌తో ఉన్న లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టి ధార్నా చేశారు. మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ నుంచి మంథని మండలం వెంకటాపూర్ క్వారీలో ఇసుక లోడ్ కోసం ఐదు రోజుల క్రితం వచ్చామని, మార్గమధ్యలో ఆర్టీఓ తమ లారీలను ఆపి కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని మండలంలోని సూరయ్యపల్లి రైస్ మిల్లులో దించాలని సూచించారని పేర్కొన్నారు. సదరు రైస్‌మిల్లర్ ఐదు రోజులుగా ధాన్యం దించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, కుటుంబసభ్యుల నుంచి ఫోన్లు వస్తున్నాయని వాపోయారు. హమాలీలు లేరన్న సాకుతో ధాన్యం దించుకోవడం లేదన్నారు. విషయం తెల్సుకున్న మంథని సీఐ సతీశ్, ఎస్సై రాణివర్మ అక్కడకు చేరుకొని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

క్లుప్తంగా

సెమ్స్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంకు



నిశితను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన పసుల మల్లేశ్ కూతురు నిశిత సెమ్స్ ఒలింపియాడ్‌లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం ఆ విద్యార్థినిని బీజేపీ మల్కాపూర్ మండల శాఖ అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామ స్వరూప, ఈదునూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గిద్దె పృథ్వీరాజ్‌ను కులం పేరుతో దూషించిన నలుగురు వ్యక్తులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సుధాకర్ తెలిపిన ప్రకారం పృథ్వీరాజ్ జాబితాపూర్‌కు చెందిన మారుశెట్టి అరవింద్‌కు అప్పుగా రూ.10 వేలు ఇచ్చాడు. పృథ్వీరాజ్ జాబితాపూర్‌కు వెళ్లి అప్పు చెల్లించాలని కోరగా అరవింద్, చిత్తారి మధు, గర్వందుల రాజు, ఎండీ షకీర్‌లు కులం పేరుతో దూషించి అతడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై..

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని సుభీభవ రెస్టారెంట్‌లో శనివారం రాత్రి దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాం చందర్‌రావు తెలిపారు. రెస్టారెంట్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విభూతి మారుతి కౌంటర్ వద్ద ఉండగా, అర్ధరాత్రి అజయ్‌తో పాటు మరికొందరు రెస్టారెంట్‌లోకి చొరబడి మారుతిని ఉచితంగా బిర్యానీ ఇవ్వాలని కోరగా నిరాకరించాడు. దీంతో ఆగ్రహం చెందిన వారు మారుతిపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

సారంగాపూర్(జగిత్యాల): రంగపేటలో ఆదివారం భూతగాదాలో అన్నపై తమ్ముడు దాడి చేశాడు. స్టేషన్‌హౌజ్ అధికారి వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం..తోకల అంజయ్య, తమ్ముడు తోకల మొగిలి మధ్య భూవివాదం ఉంది. ఈ విషయంలో తమ్ముడు అన్న ఇంటి ముందుకు వెళ్లి నీకు భూమి ఎక్కడిదని కర్రతో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కథలాపూర్(వేములవాడ): మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌కు చెందిన కనికారపు రవి (33) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రవి తన అత్తగారి ఊరైన బీమారం మండలం పసునూర్ గ్రామానికి ఈనెల 26న బైక్‌పై వెళ్లాడు. అదే రాత్రి తిరిగి వస్తుండగా మండలంలోని పోసానిపేట శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య మాధురి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బావ బొమ్మిరాల రాజుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

గుండెపోటుతో మహిళ..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిలి రేవతి (25) ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే రేవతి చిన్న వయస్సులోనే మృతిచెందంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త సాయిలి రమేశ్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రజావేదికలుగా రైతువేదికలు

- వ్యవసాయశాఖ కీలక నిర్ణయం
- అన్ని ప్రభుత్వ శాఖల సమావేశాలు నిర్వహించుకునేందుకు అవకాశం
- జిల్లాలో 54 వేదికలు



సుల్తానాబాద్ మండలం సుద్దాలలోని రైతు వేదిక

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రైతువేదికలు ప్రజావేదికలుగా మారనున్నాయి. రైతులకు సంబంధించిన సమావేశాలే కాకుండా ఇతర ప్రభుత్వ లబ్ధిదారులు, ఇతరత్రా సమావేశాలను నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తూ వ్యవసాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో రైతువేదికలను అన్ని ప్రభుత్వ శాఖలు తమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వినియోగించుకుంటాయని ఉన్నతాధికారులు తెలిపారు.

ఒక్కోదానికి రూ.12 లక్షల వ్యయం..

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతువేదికలు నిర్మించింది. పెద్దపల్లి జిల్లాలో రూ.12 లక్షల చొప్పున వెచ్చించి, 54 వేదికలు నిర్మించారు. వాటిల్లో మైకులు, కుర్చీలు, ఇతర సామగ్రి ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించారు. కానీ రెండు, మూడు నెలలకోసారి లేదా వానాకాలం సీజన్ మొదట్లో సమావేశాలు నిర్వహిస్తే మళ్లీ ఎండాకాలం సీజన్ ప్రారంభంలో నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత వాటి తలుపులు తెరిచేవారు ఉండరు. రైతువేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు వ్యవసాయ శాఖ తీసుకున్న నిర్ణయంతో అవి నిత్యం అధికారులు, ప్రజలతో కళకళలాడనున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ఉపయోగం..

రైతువేదికలను ప్రజావేదికలుగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సర్కారు ఆదేశాల మేరకు మేము చర్యలు తీసుకుంటాం. రైతువేదికలు అందరికీ ఉపయోగపడతాయి.
– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

ఈత.. తీర్చును వేడిమి చింత





భానుడి ప్రతాపంతో ఎండ వేడిమి తాళలేక ప్రతిరోజూ మధ్యాహ్నం సమయంలో యువకులు ఈతను ఆశ్రయిస్తున్నారు. పెద్దపల్లి శివారులోని బందంపల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి నిండా నీరు ఉండటంతో ఎక్కువ మంది అందులో ఈత కొడుతూ సేద తీరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మంచి ఒప్పందమనడం సిగ్గుచేటు

- కార్మికులకు జాతీయ సంఘాలు అన్యాయం చేశాయి
- టీజీఎల్‌బీకేఎస్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ



మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికవర్గమంతా రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉన్న సమయంలో అటు ప్రభుత్వంతో, ఇటు కోల్ ఇండియా యాజమాన్యంతో చేతులు కలిపి, జాతీయ సంఘాలు వారికి తీరని అన్యాయం చేశాయని ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(టీజీఎల్‌బీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సంఘాలు సింగరేణిలో ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. అనేక వేజ్‌బోర్డుల సందర్భంగా వేతనాల పెరుగుదలకు సమరశీల పోరాటాలు చేసిన ఘనత ఇక్కడి కార్మికవర్గానికి ఉందని తెలిపారు. కార్మికుల చైతన్యంపై నీళ్లు చల్లిన ఆయా సంఘాలు లొంగుబాటు ఒప్పందాలు చేసుకువచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి ఒప్పందమంటూ గనుల వద్ద సంబరాలు చేస్తూ గేట్ మీటింగ్‌లలో చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు మల్లేశ్, సంతోష్, కొమురయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందంలో ఏఐటీయూసీది ముఖ్య పాత్ర



మాట్లాడుతున్న సీతారామయ్య

కమాన్‌పూర్(మంథని): సింగరేణి కార్మికుల 11వ వేతన ఒప్పందంపై జాతీయ సంఘాలతో నిర్వహించిన జేబీసీసీఐ కమిటీలో ఏఐటీయూసీ ముఖ్య పాత్ర పోషించిందని ఆ సంఘం జనరల్ సెక్రటరీ సీతారామయ్య అన్నారు. ఆదివారం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లో కార్మికులతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం కార్మికులకు లాభదాయకంగా జరిగిందని తెలిపారు. సింగరేణి పర్మినెంట్ వేజ్‌బోర్డు మెంబర్‌గా ఉండి, కార్మికుల సమస్యలను వేతన కమిటీలో చేర్చడంలో కీలక పాత్ర పోషించామన్నారు. సమావేశంలో నాయకులు వైవీ.రావు, జూపాక రామచందర్, ఎంఆర్‌సీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జూలపల్లి(పెద్దపల్లి): పొలం నుంచి వరి గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా 33 కేవీ ప్రధాన లైన్ విద్యుత్ తీగలు తగిలి దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లికి చెందిన రైతు మల్లెత్తుల సంతోశ్ ఆదివారం తన పొలం నుంచి గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తున్నాడు. విద్యుత్ తీగలు కిందికి ఉండటంతో గడ్డి కట్టలు వాటికి తగిలి, మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి, ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. చొప్పదండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. లేకుంటే ట్రాక్టర్ కూడా కాలిపోయేదని కాంగ్రెస్ నాయకుడు బండి శ్రీనివాస్ తెలిపారు. కరెంటు వైర్లను ఎత్తు లేపాలని ఎన్నోసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 వేల నష్టం జరిగినట్లు ఫైర్ స్టేషన్ అధికారి నరేందర్ పేర్కొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు చేయించాలి



లీకేజీని పరిశీలిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ఆర్జీ–1 ఫిల్టర్ బెడ్ వద్ద పైపులైన్ లీకేజీని అరికట్టాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సదరు ప్రాంతాన్ని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ.గౌస్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తోడుపునూరి రమేశ్‌కుమార్‌లు పరిశీలించి, మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం రూ.లక్షలు ఖర్చు చేసి, గోదావరినది నుంచి నీటి సరఫరా కోసం పైపులైన్ వేసిందన్నారు. జీడీకే–1 ఇంక్లయిన్ ఫిల్టర్ బెడ్ వద్ద పైపులైన్ నుంచి నెల రోజులుగా వేలాది గ్యాలన్ల నీరు వృథాగా పోతూ రోడ్డంతా బురదమయంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ రోడ్డులో ముస్త్యాల, సుందిల్ల, జనగామ గ్రామాలకు చెందిన ప్రజలు గోదావరిఖనికి వెళ్తుంటారని, బస్టాండ్ కాలనీ, ఐబీ కాలనీ, గాంధీనగర్, జీఎం కాలనీల నుంచి కార్మికులు, ఉద్యోగులు విధులకు హాజరవుతారని తెలిపారు. రోడ్డుపై నిలిచిన నీటితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి, పైపులైన్‌కు మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శనగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సురేందర్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లికి చెందిన పిట్టల సురేందర్(30) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో తన అన్నయ్య కొత్తగా నిర్మించుకున్న రేకుల షెడ్డుకు సురేందర్ ఆదివారం సాయంత్రం నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న 11 కేవీ వైరు చేతికి తగలడంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గొర్రెల కాపరులు చనిపోతే ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కోశాధికారి మేకల కృష్ణయాదవ్



ఆర్థికసాయం అందిస్తున్న కృష్ణయాదవ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): గొర్రెల కాపరులు ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కోశాధికారి మేకల కృష్ణయాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లికి చెందిన జంగా కొమురయ్య అనే గొర్రెల కాపరి ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి ఆదేశాల మేరకు రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కాపరులు అడవిలో జీవాలను మేపుతూ పాముకాటు, పిడుగుపాటుకు గురై చనిపోయిన సందర్భంలో బాధిత కుటుంబాలకు సర్కారు అండగా నిలవాలని కోరారు. సాధారణంగా మృతి చెందితే రూ.5 లక్షలు అందజేయాలని, 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు ఆసరా పెన్షన్ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్, నాయకులు వెంకటరమణ, శ్రీనివాస్, కుమార్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున సంపద వనాలు

- జిల్లాలోని 3 మండలాల్లో 50 ఎకరాల స్థలం గుర్తింపు
- ఆదాయాన్నిచ్చే మొక్కల పెంపకానికి కసరత్తు
- వచ్చే నెలలో నాటేందుకు ప్రణాళిక

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గోదావరినది ఒడ్డున ఆదాయాన్నిచ్చే టేకు, వెదురుతోపాటు పండ్ల మొక్కలను పెంచే సంపద వనాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో చేపట్టేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గోదావరి నది ఒడ్డున విరివిగా మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధిహామీ పథకం కింద పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. జూన్‌లో వర్షాలు కురిసే సమయంలో చేపట్టే హరితహారంలో భాగంగా నదుల వద్ద కూడా మొక్కలు నాటే కార్యక్రమానికి సన్నద్ధమవుతున్నారు.

73 వేల మొక్కలు..

పెద్దపల్లి జిల్లాలో గోదావరినది ప్రవహించే అంతర్గాం, ధర్మారం, మంథని మండలాల్లోని పలు గ్రామాల్లో 50 ఎకరాల స్థలాన్ని అధికారులు గుర్తించారు. ఇందులో 73 వేల మొక్కలు నాటించేందుకు కసరత్తు చేస్తున్నారు. అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి, గోయిల్‌వాడ ప్రాంతంలో 19 ఎకరాల్లో 37,500 మొక్కలు నాటాలని భావిస్తున్నారు. అలాగే ధర్మారం మండలంలోని మల్లాపూర్, మేడారం, శాయంపేట గ్రామాల్లో 13 ఎకరాల్లో 17,550 మొక్కలు, మంథని మండలంలోని సిరిపురం, ఉప్పట్ల, గుంజపడుగు గ్రామాల్లో 18 ఎకరాల్లో 18,000 మొక్కలను నాటించాలని యోచిస్తున్నారు. వేప, అల్లనేరేడు, రావి, జువ్వి, తాని, మునగ, వెదురు, నారెప, కుంకుడు, ఉసిరి, మామిడి, సపోట, చింత, సండ్ర, జామ, నెమలినార, రేల, గుల్‌మొహర్, గన్నేరు, ఈత, ఖర్జూర, అడవిబాదం, కానుగ, సిసూ, తాటి మొక్కలు నాటించనున్నారు.

పర్యావరణానికి మేలు..

పెద్దపల్లి జిల్లాలో గోదావరినది ఒడ్డున సంపద వనాల ఏర్పాటులో భాగంగా మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాం. నదుల గట్లపై మొక్కలు నాటితే అవి చెట్లుగా ఎదిగి, సరిహద్దుగా ఉంటాయి. పర్యావరణానికి మేలు జరుగుతుంది.
– శ్రీధర్, డీఆర్డీవో, పెద్దపల్లి

ప్రమాదవశాత్తు కారు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న కారు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని రూపునారాయణపేట గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ కారు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనికి చెందినవారు ఆదివారం పొత్కపల్లిలో జరిగిన వివాహానికి కారులో వచ్చారు. సమీపంలోని రూపునారాయణపేట మానేరులో నిర్మిస్తున్న చెక్‌డ్యాంను చూసేందుకు వెళ్లారు. పక్కన పంట పొలాల్లో చెలరేగిన మంటలు కారుకు అంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై లక్ష్మీరాజం తెలిపారు.

కాలు పని చేయక.. కదల్లేక

- నాలుగు రోజులుగా ఎద్దు యాతన
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతం





కదల్లేని ఎద్దుకు సపర్యలు చేస్తున్న రైతు, రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులో ఓ ఎద్దు మేత మేస్తూ రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. దాని తోక ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై, పడిపోయింది. ఎద్దు కాలు పని చేయకపోవడంతో ఎటూ కదల్లేక నాలుగు రోజులుగా యాతన పడుతోంది. పశువైద్యాధికారితో చికిత్స చేయిస్తున్నానని రైతు తోకల శంకరయ్య తెలిపాడు. పంట భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లేడీస్ క్లబ్ సభ్యులకు ఆటలపోటీలు



గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని రామగుండం ఏరియా–1 లేడీస్ క్లబ్ సభ్యులకు ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. ఇల్లందు క్లబ్ ఆవరణలో జరిగిన పోటీలను ఆర్జీ–1 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని, పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరూ విజేతలేనని అన్నారు. జూన్ 5న రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ బీనా సింగ్, చిలుక లక్ష్మి, రోజా, నిర్మల, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి(ధర్మపురి): మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1985 నుంచి 90వ సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకుంటూ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. కాగా మంత్రి ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత పాల్గొని కేక్‌కట్ చేశారు. అప్పటి గురువులు కిషన్‌రావు, పరంధాములు. కిష్టయ్య, లక్ష్మణ్, పాఠశాల హెచ్‌ఎం లచ్చయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మిమిక్రీతో అలరించిన మేజిక్‌రాజా



ప్రదర్శన ఇస్తున్న మేజిక్ రాజా

జ్యోతినగర్(రామగుండం): బాలికా సాధికారత మిషన్(జెమ్)లో మేజిక్ రాజా తన మిమిక్రీతో అలరించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ శిక్షణ శిబిరంలోని పిల్లల మానసికోల్లాసానికి ఆదివారం కాకతీయ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడే బొమ్మతో ప్రదర్శన ఇచ్చారు. పిల్లల కేరింతలు, చప్పట్లతో ఆడిటోరియం మార్మోగింది. కార్యక్రమంలో స్థానిక మెజీషియన్ హరి, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ సీఎస్సార్ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.

రాజన్నపేటలో తాళం వేసిన ఇళ్లలో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాజన్నపేటలో తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన దండం మైసయ్య, వజ్రవ్వ ఇళ్లలో దాదాపు రూ.50వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలను అపహరించారు. మరికొందరి ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న సీఐ మొగిలి, ఎస్ఐ శేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.